## వైభవంగా ఉలవపాడు వేణుగోపాలస్వామి రథోత్సవం



ఉలవపాడు, మే 24, ప్రభాతవార్త ఉలవపాడులో ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవస్థానం నందు శుక్రవారం నాడు రథోత్స వం ప్రత్యేక అలంకరణలతో అశేష భక్తజన నడుమ గోవింద నామస్మరణలతో మార్మోగింది. ఉలవపాడు గ్రామ పురవీధుల్లో భక్తులు రథాన్ని లాగి వారి మొక్కులు చెల్లించుకున్నారు. మండలం నలు మూలల నుండి వచ్చిన భక్తులతో ఉలవపాడు కిక్కిరిసింది. ప్రధాన అర్చకులు చక్రవర్తుల రంగనాథచార్యులు ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య అత్యంత వైభవంగా జరిగింది. ఉభయకర్తలుగా కోటిరెడ్డి, సుధీష్ చంద్రారెడ్డి వ్యవహారించగా కి.శే కారసాల వెంకటాద్రి(డిష్‌నాయుడు), భార్య శ్రీదేవి రథోత్స వానికి పూలఅలంకరణ దాతగా నిలిచారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి కోడూరి పెంచల వరప్రసాద్, అర్చక సిబ్బంది, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

## కోనలో పుష్కరిణిలో నృసింహునికి తెప్పోత్సవం



పెంచలకోన(రాపూరు),మే24ప్రభాతవార్త ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహా స్వామి వారికి నిర్వహిస్తున్న వార్షికబ్రహ్మోత్స వాలలో బాగంగా శుక్రవారం రాత్రి స్వామి వారికి తెప్పోత్స వం నిర్వహించారు. ఇందులో బాగంగా మధ్యాహ్నం 12 గంటలకు స్వామి వారి మూలమూర్తికి ప్రత్యేకంగా అభిషేకం నిర్వహించారు. రాత్రి స్వామి,వారినిఉభయదేవేరులతో కలపి స్వామి వారి పుష్కరిణిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తెప్పపై వుంచి,మంగళవాయిద్యాల మధ్య పుష్కరిణిలో తెప్పోత్స వం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులుఉభయదేవేరులతో కలసి పుష్కరిణిలో తెప్పపై విహరిస్తున్న స్వామి వారిని దర్శించుకోని పూజలు నిర్వహించారు.తెప్పోత్స వ కార్యక్రమానికి ఉభయకర్తలుగా సైదాపురం మండలం,తురిమెర్ల గ్రామానికి చెందిన మేడికోండ పద్మమో హన్‌చౌదరి,స్నేహ దంపతులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉప కమీషనర్ జె.విజయ సాగర్ బాబు, సినియర్ సహాయకుడుపాలవల్లి లక్ష్మీ నారాయణ,ఆలయ ప్రధానార్చకులు రామయ్య స్వామి, పెంచలయ్య స్వామి, శశి స్వామి, మధు స్వామి,నాగరాజు స్వామి, వినోద్‌స్వామి,మోక్షజ్ఞ స్వామి తదితరులు స్వామి వారి పూజా,అలంకరణ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

## ప్రారంభమైన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు



నెల్లూరు,మే24 ప్రభాతవార్త- విద్య శుక్రవారం జిల్లాలోని 51 పరీక్షా కేంద్రాల్లో ఇంటర్ ప్రదమ, ద్వితీయ సంవత్స రం విద్యార్థులకు అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాతంగా ప్రారంభమైయ్యాయి. ఉదయం 9 గం టలనుండి 12 గంటల వరకు జరిగిన ప్రధమ సంవత్స రం పరీక్షల్లో జనరల్,ఒకేషనల్ విద్యార్థులు మెత్తం కలిపి5764మంది హాజరు కావాల్సి ఉండగా 5439మంది హాజరు అయ్యారు. 325 మంది విద్యార్థులు గైర్హాజరైయ్యారు. మధ్యాహ్నం 2.30 గంటల నుండి 5.30 గంటల వరకు జరిగిన ద్వితీయ సంవత్స రం పరీక్షలకు జనరల్,ఒకేషనల్ మెత్తం కలిపి 800మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 725మంది హాజరు అయ్యా రు.75మంది విద్యార్థులు గైర్హాజరైయ్యారు. నగరంలోని నారాయణ, శ్రీచైతన్య, కళాశాలల్లోని కేంద్రాలను ఆర్ఐఓ పరిశీలించారు. మిగిలిన ఉన్నతాధికారులు జిల్లాలోని 37 కేంద్రాలను తనిఖీచేశారు.

## సుప్రీం కోర్టు న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్



నెల్లూరు అర్బన్, మే 24, ప్రభాతవార్త సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ సిటీ రవికుమార్‌ను శుక్రవారం ఆర్అండ్‌బి అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ ఎం. హరినారాయణన్, ఇన్‌చార్జి జిల్లా జడ్పి కబర్తి, జిల్లా అదనపు ఎస్పి సౌజన్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ కె. సాంబశివారెడ్డి, రెవెన్యూ డివిజన్ అధికారి మలోల, రూరల్ తహశీల్దార్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కౌంటింగ్ ప్రక్రియ పరిశీలనకు నలుగురు అబ్జర్వర్లు నియామకం

**నెల్లూరు అర్బన్, మే 24, ప్రభాతవార్త** సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను పూర్తి స్థాయిలో పరిశీలించేందుకు నలుగురు అబ్జర్వలను భారత ఎన్నికల సంఘం నియమించింది. నెల్లూరు రూరల్ మండల పరిధిలోని కనుపర్తిపాడు ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియ జూన్ 4న ప్రారంభం కానుండగా, నియోజకవర్గాల వారీగా కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించేందుకు ఎన్నికల సంఘం అబ్జర్వర్లను నియమించింది. కందుకూరు, నెల్లూరు రూరల్ అసెంబ్లీ నియోజకవర్గాలకు అబ్జర్వర్‌గా రామ్ కుమార్ గౌతమ్, కావలి, ఆత్మకూరు నియోజకవర్గాలకు టీజీ అభిలాష్ కుమార్, కోవూరు, నెల్లూరు సిటీ, ఉదయగిరి అసెంబ్లీ నియోజకవర్గాలకు నితిన్ సింగ్ బదారియ, సర్వేపల్లికి జయేంద్ర కుమార్, విజయవత్ అబ్జర్వర్లుగా వ్యవహరించనున్నారు.

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



## కోనలో వైభవంగా వసంతోత్సవాలు..చక్రస్నానం





**పెంచలకోన(రాపూరు),మే24(ప్రభాతవార్త** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహా స్వామి వారికి నిర్వహిస్తున్న వార్షికబ్రహ్మోత్స వాలలో బాగంగా శుక్రవారం ఉదయం స్వామి వారికి వసంతోత్స వాలు, చక్రస్నానం కార్యక్రమాలునిర్వహించారు. వసంతోత్స వాల సందర్బంగా స్వామి అమ్మ వార్ల ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం కోత్త దంప తులైన స్వామి,అమ్మవార్లకు పసుపు,కుంకుమ కలిపిన నీటిని పోసి వసంతాలు నిర్వహంచారు.ఈ సందర్బంగా ఆలయ అర్చక స్వాములు,తిరుమల వేదపాఠశాల విద్యార్థులు,ఆలయ ఉప కమీషనర్,ఇతర సిబ్బందిద, భక్తులు కూడా ఒకరిపై ఒకరు వసంతాలు పోసుకోని సంబరాలు నిర్వహించారు.ప్రధాన అర్చకులు గిరిజన వాయిద్యాలువాయిస్తూ ఆనందించారు. అనంతరం స్వామి అమ్మవారు, చక్రత ళ్వార్‌కు స్వామి వారి ఉద్యానవనంలోని మండపంలోపలు రకాలైన సుగంధ ద్రవ్యాలు,పండ్ల రసాలు,పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు.తదుపరి స్వామి వారి చక్రతళ్వార్‌కు స్వామి వారి పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహించారు. స్వామి వారి చక్రస్నానం సందర్బంగా వేదపండితులు,అర్చక స్వాములు,ఆలయ సిబ్బంది, భక్తులు స్వామి వారి చక్రతళ్వార్‌తో పాటు పుష్కరిణిలోచక్రస్నానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉప కమీషనర్ జె.విజయ సాగర్ బాబు, సినియర్ సహాయకుడుపాలవల్లి లక్ష్మీ నారాయణ,ఆలయ ప్రధానార్చకులు రామయ్య స్వామి, పెంచలయ్య స్వామి, శశి స్వామి, మధు స్వామి,నాగరాజు స్వామి, వినోద్ స్వామి,మోక్షజ్ఞ స్వామి తదితరులు స్వామి వారి పూజా,అలంకరణ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

## రేవ్ పార్టీకి నాకు ఎలాంటి సంబంధం లేదు - కాకాణి

### సోమిరెడ్డి నా పై బురద చల్లుతున్నాడు .. ఎవరు డ్రగ్స్ తీసుకుంటారో తెలుసుకుందాం రా ప్రజలకి ఏది నిజం ఏది అబద్దం అని చెప్పడానికే మీడియా ముందుకు వచ్చా



**నెల్లూరు రూరల్, మే 24, ప్రభాతవార్త** బెంగళూరులో రేవ్ పార్టీ పేరుతో బడా నేతలు సెల్రబిటీలును పోలీసులు అదుపులోకి తీసుకుని వార్తల్లోకి ఎక్కింది అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి రేవ్ పార్టీతో కాకాని గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిందని చెప్పడాన్ని కాకాని గోవర్ధన్ ఒరెడ్డి తీవ్రంగా ఖండించారు. సోమిరెడ్డి నన్ను ఎదుర్కోలేక అవాకులు చవాకులు పేల్చుతున్నాడని రాజకీయంగా నన్ను దెబ్బతీయలేక వ్యక్తిగతంగా నన్ను డ్యామేజ్ చేయాలని చూస్తున్నారని కాకాణి గోవర్ధన్ రెడ్డి తెలి పారు. శుక్రవారం నెల్లూరు బాగుంటా లే ఔట్‌లోని వైఎస్ఆర్‌సిపి జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోమిరెడ్డి ఎన్ని అబద్దాలు చెప్పినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని ఆయన అన్నారు. రేవ్ పార్టీలో నా పేరుతో ఉన్న ఎమ్మెల్యే స్టిక్కర్ ఉన్న కారుకి నాకు ఎలాంటి సంబంధం లేదని దానిపై జిల్లా ఎస్పికి కంప్లైంట్ ఇచ్చానని ఆ ఎఫ్ఐఆర్ కాపీ మీడియా సమక్షంగా చూపించారు. సోమిరెడ్డి నా పాస్పోర్ట్ అక్కడ దొరికిందని గోపాల్ రెడ్డి అనే వ్యక్తితో నాకు సంబంధాలు ఉన్నాయని మాట్లాడడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. నా పాస్పోర్ట్ అబద్దాలు చెప్పి నా పై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని దమ్ము ధైర్యం ఉంటే రా ఎక్కడికైనా వెళ్లి ఇద్దరి బ్లడ్ శాంపిల్స్ ఇద్దాం ఎవరు డ్రగ్స్ వాడతారో ఎవరు మద్యం తాగుతారు తెలిపోతుందని సోమిరెడ్డికి సవాల్ విసిరారు. కావాలనే నా పై అసత్య ప్రచారం సోమిరెడ్డి మొదలెట్టాడని ఆయన తెలిపారు. నాలుగు రోజులు ఆగితే మా ప్రభుత్వం వస్తుందని నన్ను బెదిరిచ్చే ప్రయత్నం చేస్తున్నాడని రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ వచ్చేది సమస్య లేదని అంతకు మించి సోమిరెడ్డి గెలిచే పరిస్థతి సర్వేపల్లిలో లేదని ఆయన ఎద్దేవా చేశారు. ఇలాంటి వ్యక్తి నాకు ప్రత్యర్ధి కావడం నా దురదృష్టకరమన్నారు. నిజనిజాలు తెలియకుండానే నా పై వ్యక్తిగత ఆరోపణలు దిగుతున్న ప్రతిపక్ష నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాటలు ప్రజలు ఎవరు నమ్మే పరిస్థతి లేదన్నారు. కర్ణాటక పోలీసులు ఎక్కడ నా పాస్‌పోర్టు దొరికిందన్న విషయం ఎక్కడా తెలుపలేదన్నారు.

## ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం కౌంటింగ్ ప్రక్రియ

**నెల్లూరు అర్బన్, మే 24, ప్రభాతవార్త** ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం కౌంటింగ్ ప్రక్రియ సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం. హరినారాయణన్ రిటర్నింగ్ అధికారులకు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆర్‌వోలు, ఎఆర్ఓలతో కౌంటింగ్ నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో కలెక్టర్ హరి నారాయణన్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ జారీ చేసిన నిబంధనలు, ఆర్పి యాక్ట్ చదివి అర్థం చేసుకుని కౌంటింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలన్నారు. ఆర్వోలు, ఏఈర్వోలు సమన్వయంతో పనిచేసి నిష్పక్షపాతంగా, సమర్ధవంతంగా కౌంటింగ్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. కౌంటింగ్ హాల్‌లో బ్యాలెట్, ఇవిఎంల ఓట్ల లెక్కింపు అవసరమైన టేబుల్స్ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కౌంటింగ్ రోజు అన్ని వాహనదాలు కనపర్తిపాడు లోని హైస్కూల్ వరకు మాత్రమే అనుమతించబడతాయని అందువల్ల ఏజెంట్లు కౌంటింగ్ అధికారులు, సిబ్బందిని తరలించడానికి తగినన్ని బస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో రిటర్నింగ్ అధికారులు మున్సిపల్ కమిషనర్ వికాస్ మర్మత్, జాయింట్ కలెక్టర్ సేధు మాధవన్, కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరి, డిఆర్ఓ ఎస్. లవన్న, నుడా విసి బాపిరెడ్డి, ఓబులేసు, ప్రేమ్ కుమార్, మాలోల, మధులత, డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస్, ఎఆర్ఓలు పాల్గొన్నారు.



## నేడు ఏపీపీఎస్సీ పరీక్ష

**నెల్లూరు అర్బన్, మే 24, ప్రభాతవార్త** జిల్లా వ్యాప్తంగా ఈ నెల 25న (శనివారం0 జరగనున్న ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) పరీక్షను సమర్ధవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు డిఆర్ఓ లవన్న తెలిపారు. శుక్రవారం నెల్లూరు కలెక్టరేట్‌లో ఎస్ఆర్ శంకరన్ హాలులో డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పోస్టుల భర్తీ కోసం ఏపీపీఎస్సీ నిర్వహిస్తున్న ఆన్లైన్ పరీక్ష పై సమన్వయ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లతో డిఆర్ఓ లవన్న, ఏపీపీఎస్సీ సెక్షన్ అధికారులు .ఇ. అశోక్, రామాంజి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 5 పరీక్ష కేంద్రాల్లో ఈనెల 25న (శనివారం) ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు ఆన్‌లైన్ పద్దతిలో పరీక్ష జరుగుతుందని, పరీక్షకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 1070 మంది అభ్యర్థులు డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టుల పోటీ పరీక్షకు హాజరవుతున్నారని, ఎవరికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు సమకూర్చుకోవాలన్నారు. కావలిలో పిబిఆర్ విశ్వదయ ఇంజనీరింగ్ కాలేజీ, రామిరెడ్డి సుబ్బారామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో, కోవూరులోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాల, ముత్తుకూరు రోడ్‌లోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల, పొట్టెపాలెం సమీపంలోని అయాన్ డిజిటల్ జోన్ పరీక్షా కేంద్రాల్లో పరీక్ష నిర్వహించేందుకు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.



ఆన్‌లైన్ పద్దతిలో పరీక్ష నిర్వహిస్తున్నందున ఇంటర్నెట్, కంప్యూటర్ సాంకేతిక సమస్యలు లేకుండా ముందుగానే చూసుకోవాలన్నారు. సెల్ పోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రాలకు అనుమతించవద్దని, విద్యార్థులు హాల్ టికెట్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డును తప్పనిసరిగా పరిశీలించాలని, ఏపీపీఎస్సీ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ పరీక్షను ప్రశాంతంగా నిర్వహించాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. విద్యార్థులు నిర్ణీత సమయానికంటే ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ఏపీఎస్ఆర్టీసి అధికారులు బస్సులను నడపాలని చెప్పారు. పరీక్ష సమయంలో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. లయజనింగ్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్‌లు ఒక చెక్ లిస్ట్ తయారు చేసుకుని అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి జిల్లాలో ప్రశాంత వాతావరణంలో పరీక్ష నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సమన్వయ అధికారులు బ్రహ్మయ్య, గోపికృష్ణ, ఇలియాజ్, గయాజ్, ప్రదీప్, చీఫ్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

## బుచ్చి మండలానికి వందల టన్నుల చికెన్ వేస్టు

### పంటకాలువలలోకి వదులుతున్న వేస్టునీరు,మూగజీవాలు బలి మామూళ్ళ మత్తులో మత్స్యశాఖ





బుచ్చి మే 24 ప్రభాతవార్త బుచ్చి మండలంలో చేపల గుంటలలో మేతగా వేసేందుకు ఇతర రాష్ట్రాల నుండి వందల టన్నుల చికెన్ వేస్టు వస్తుంది. ఈ వేస్టు వాహనం రోడ్డుపైన వెళ్ళిన అర్ధగంట వరకు దుర్గంధమైన వాసన పోదు. సదరన్ చానల్ పక్కన సంగం మండలం అన్నారెడ్డిపాళెం సమీపంలో, అలాగే మినగల్లు సమీపంలో చేపలగుంటల వేస్టు నీళ్ళు అన్ని సదరన్ ఛానల్‌లోకి వదులు తుంటే ఆనీటిని త్రాగి మూగ జీవాలు అనారోగ్యానికి గురై పాలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదంటు పాడి రైతులు వాపోతున్నారు. బుచ్చిరెడ్డిపాళెం మండలం దామరమడుగు ,రేబాల,కాగులపాడు తదితర గ్రామాలకు నిత్యం వందలకొద్ది చికెన్ వేస్టు నిత్యం 50 లారీల వరకు వస్తుంది.కర్నాటక,తమిళనాడు తదితర రాష్ట్రాల నుండి వస్తుంది. చికెన్ వేస్టేజి తిన్న చేపలు మనుషులు తింటే క్యాన్సర్ వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుండి చికెన్ వేస్టు ఇతర రాష్ట్రాల నుండి వస్తున్నా ఆయా శాఖల అధికారులు అంతా తెలిసి మా ముళ్ళ మత్తులో వదిలి వేస్తున్నారన్న ప్రజలు తీవ్రంగా విమర్శలు చేస్తున్నారు. చేపల గుంటలలో చికెన్ వేస్టే జి వేస్తే చుట్టుపక్కల



పొలాలు కూడా దెబ్బతిని పోతా యి. గ్రామాల సమపంలో చికెన్ వేస్టు వేస్తే గాలి తోలినప్పుడు ఆ దుర్గంధమైన వాసన గ్రామంలోకి వస్తుండడంతో ప్రజలు భరించలేకపోతున్నారు. గ్రా మాన్ని ఆనుకొని చేపలు గుంటలు వేస్తున్నా సంబంది త శాఖ అధికారులు ఏవిధంగా అనుమతులు ఇస్తాన్నా రో అర్థం కావడంలేదు. జిల్లా కలెక్టర్ దీనిపైన ప్రత్యేక దృష్టి పెట్టి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన అవసరం ఎంతైనా వుంది.

## భూసార పరీక్షపై రైతులకు అవగాహన



**బిట్రగుంట, మే 24 ప్రభాతవార్త :** బోగోలు మండలం కోవూరుపల్లి రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం పీయం ప్రణామ్ కార్యక్రమంలో భాగంగా రైతులకు భూసార పరీక్ష దాని ఆవశ్యకత గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖాధికారిణి ఎస్.విజయలక్ష్మి మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలు జీలుగ, జనుము, పిల్లిపెసర చల్లుకొని దుక్కి దున్నితే భూసారాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. తద్వారా పంటల దిగుబడి పెరుగుతుందన్నారు. మండలంలోని జక్కేపల్లిగూడూరు, నాగులవరం, తాళ్ళూరు గ్రామాలలో 400 ఎకరాలలో వేరుశనగ సాగు చేస్తున్నారని తెలిపారు. ఈ పంటలో వేరుకుళ్ళు, కాండం కుళ్ళు తెగుళ్ళు ఆశించి వున్నాయన్నారు. పంటలు సంరక్షించుకునేందుకు ఆమె సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ గ్రామ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

## పర్యావరణం సంరక్షించడం మనందరి బాధ్యత



**బిట్రగుంట, మే 24 ప్రభాతవార్త :** పర్యావరణం సంరక్షించడం, కాలుష్య నివారణ కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని కావలి డిప్యూటీ డిఈవో యం.రఘు రామయ్య సూచించారు. మండలంలోని విశ్వనాథరావు పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఆవార్డు స్వచ్ఛంద సేవా సంస్థ అధినేత గోవా బాలశౌరి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యత కూడా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గండూరు మంజుల ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు యం.జయమ్మ, పి.వి.నరసింహారావు, ఉన్నత పాఠశాల బాలుర, బాలిక ప్రధానోపాధ్యాయులు రవీంద్రనాథ్‌ఠాగూర్, గంగాధర్‌లు పాల్గొన్నారు.

## తెలుగుదేశంపార్టీ కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా అండగా ఉంటాం



**కావలి రూరల్, మే 24 ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు ఏ చిన్నపాటి కష్టం వచ్చినా వారికి ఎల్లవేళలా అండగా వుంటానని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, కావలి నియోజకవర్గ టిడిపి నేత మాలేపాటి సుబ్బానాయుడు తెలిపారు. కావలి రూరల్ మండలం చౌదరిపాళెం గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు గోరంట్ల రాంబాబు వాహనాన్ని శుక్రవారం కావలి మండలంలోని గౌరవరం సమీపంలో లారీ ఢీకొనింది. విషయం తెలుసుకున్న మాలేపాటి సుబ్బానాయుడు హుటాహుటిన కావలి రూరల్ పోలీస్ స్టేషన్‌కు చేరుకొని జరిగిన సంఘటనను అడిగి తెలుసుకున్నారు. తగిన న్యాయం జరిగే విధంగా మాట్లాడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు జిల్లా ఉపాధ్యక్షులు బొట్లగుంట శ్రీహరినాయుడు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి చొరవతో వైద్యశిబిరం



**కావలి రూరల్, మే 24 ప్రభాతవార్త :** కావలి రూరల్ మండలం సర్వాయపాళెం పంచాయతీ మాతినవారి పాళెం గ్రామంలో ఇటీవల కొందరు అతిసారతో బాధపడుతూ వైద్యశాలలో చికిత్స తీసుకుంటున్న నేపథ్యంలో కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అభ్యర్థన మేరకు గ్రామంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. తాగునీటి శాంపిల్స్‌ను తీసుకొని ల్యాబ్‌కు పంపారు. తాగునీటిలో ఎటువంటి ఇబ్బందులు లేవని నిర్ధారించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో ఎ.వి.కృష్ణమోహన్, డిప్యూటీ డియంఅండ్‌హెచ్‌వో డాక్టర్ బ్రిజిత, డిఎల్‌పివో, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. వైద్యులు గ్రామంలో అతిసారకు గల కారణాలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులకు ధైర్యం చెప్పారు.

## బుద్ధ విహార్‌లో ఘనంగా వైశాఖ బుద్ధ పూర్ణమి వేడుకలు



**కావలి రూరల్, మే 24 ప్రభాతవార్త :** కావలి అంబేద్కర్‌నగర్‌లోని బుద్ధ విహార్‌లో వైశాఖ బుద్ధ పూర్ణిమ వేడుకలు బుద్ధ విహార్ నిర్వాహకులు పాలేటి పుల్లయ్య బోధి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జై బుద్ధం నినాదాలతో ఉపాసిక, ఉపాసకులు, విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. బుద్ధ, దమ్మ, సంఘ వందన స్వీకరణ అనంతరం సంఘ ప్రవచనాలతో వక్తలు గౌతమ బుద్ధుని గురించి ప్రభోదించారు. అనంతరం విహార్‌లో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాసిక, ఉపాసుకులు పూజల జయప్రకాష్, పూజల మమత, సంఘ జ్యోతి, మదన్, జీవన్, కృష్ణ, డాక్టర్ శివప్రసాద్, సరిత, మాచర్ల, సన్నీ, లోహిత్, డాక్టర్ ప్రభాకర్ కుటుంబం, ఇ.అంజయ్య, కె.వెంకటేశ్వర్లు, జె.రవీంద్రబాబు, కె.బాబురావు, బి.ఎన్.భూషణం, యం.వి.రమణయ్య, జి.హరనాథ్, యం.ఉదయభాస్కర్, పద్మ, ఎ.తిరుమలేష్, లోకనాద్, వర్ధన్, అంబటి కొండలరావు, సునీత, ఆంజనేయులు, విహార్ విద్యార్థులు పాల్గొన్నారు.

## వేరుశనగ రైతులకు తెగుళ్లపై అవగాహన కార్యక్రమం



**ఉలవపాడు, మే 24, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పీఎం ప్రణామం కార్యక్రమంలో ఉలవపాడు మండలం అలగాయపాలెం గ్రామంలో వేరుశనగ వేసే రైతులకు పూర్తిగా రసాయనిక ఎరువులు వ్యవసాయం కాకుండా ఉండే సమస్య అయినా నులి పురుగు వేరు కుళ్ళు మొదలు కుళ్ళు తెగుళ్ళను బయోప్రొడక్ట్ అయినటువంటి పీసీలో మైసిస్ అలసిన ఎస్ ట్రైకోడెర్మా విరిడి సుడు మొనసస్ 200 కేజీలు పశువుల ఎరువులలో కలిపి వేసుకుంటే నెల నుండి సంక్రమించి వ్యాధుల నుండి మనం లబ్ధి పొందవచ్చని కేవీఆర్ సీటీఆర్ఐ కందుకూరు శాస్త్రవేత్త ప్రసాద్‌బాబు రైతులకు వివరించడం జరిగింది. ప్రస్తుతం వేరుశనగ విత్తనం వేసే సమయం ఆసన్నమైనందున రైతులు భూమిలో వేపచెక్క 200 కేజీలు తప్పక వేయాలని తెలియజేశారు. వేరుశనగ విత్తనాలకు గ్రోచ్ గ్రూప్స్ కవి కోనంగల్ కలిపిన మందులు విత్తన శుద్ధి చేయాలని తెలియజేశారు. తొలి దశలో కలుపు సమస్యకు దుక్కిలో సలాం టాటా వారిది 12.5 కేజీలు ఎకరాకు వాడుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి తిరుమల జ్యోతి, రైతు భరోసా సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బీటీఏ కుటుంబ భరోసా పథకం ప్రారంభం

**ఉలవపాడు, మే 24, ప్రభాతవార్త :** ఉలవపాడు మండలంలో బీటీఏ కుటుంబ భరోసా పథకంను ప్రారంభించిన కావలి మండల విద్యాశాఖాధికారి బండి గోవిందయ్య, ఉలవపాడు మండల విద్యాశాఖాధికారి పీవీ రమణయ్య. శుక్రవారం ఉలవపాడులో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయుల సంక్షేమం కోసం బహుజన టీచర్స్ అసోసియేషన్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన బీటీఏ కుటుంబ భరోసా పథకంను కావలి మండల విద్యాశాఖాధికారి పీవీ రమణయ్యలు ప్రారంభించగా మండలంలోని 31మంది ఉపాధ్యాయులు ఈ పథకంలో సభ్యులుగా చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మండల ప్రధాన కార్యదర్శి దన్నాసి మురళి సభా పరిచయం చేయగా సమావేశానికి మండల అధ్యక్షులు పున్నేపల్లి శ్రీను అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఎంఈఓలు బండి గోవిందయ్య, పీవీ రమణయ్యలు విచ్చేశారు. ఈ సందర్భంగా బండి గోవిందయ్య మాట్లాడుతూ ఇతర, అనుకోని కారణాల వల్ల మరణించిన బీటీఏ ఉపాధ్యాయుల కుటుంబానికి బీటీఏ తక్షణమే ఒక లక్ష రూపాయలు చెల్లించే విధంగా ఈ పథకాన్ని రూపొందించడం ఉపాధ్యాయులకు మేలు చేస్తుందని పేర్కొన్నారు. అనంతరం పీవీ రమణయ్య మాట్లాడుతూ బీటీఏ కుటుంబ భరోసా పథకం ఉపాధ్యాయులకు సహాయకారిగా ఉండడమే కాక సంఘం బలోపేతం కావడానికి కూడా సహాయపడుతుందని పేర్కొన్నారు. బీటీఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు మేడికొండ భాస్కరరావు మాట్లాడుతూ ఒక్కో రోజే 31 మంది ఉపాధ్యాయులు బీటీఏ కుటుంబ భరోసా పథకంలో చేరడం సంతోషాన్నిస్తుందని అలాగే మండలంలోని, జిల్లాలోని బహుజన ఉపాధ్యాయులందరూ బీటీఏ ప్రారంభించిన బీటీఏ కుటుంబ భరోసా పథకంలో సభ్యులుగా చేరి సంఘ అభివృద్ధికి, సమాజ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా కార్యదర్శులు దాసరి వెంకటరత్నమ్మ, గేరా కోటేశ్వరి, దార్ల రాధాకుమారి, మండల గౌరవ అధ్యక్షులు గౌస్ భాషా, మండల నాయకులు పాలేటి సుబ్బారావు, ఎలిచర్ల కోటేశ్వరావు, టి.చంద్రమౌళి, జిల్లా నాయకులు ధన్నాసి శోభన్‌బాబు, సుదర్శ ప్రభాకర్‌రావు, రాష్ట్ర కార్యదర్శులు ఎద్దు బ్రహ్మయ్య, దార్ల కోటేశ్వరరావులు పాల్గొన్నారు.

## ఓవర్ హెడ్ రక్షిత నీటి పథకాల ట్యాంకుల పరిశుభ్రతలో నిర్లక్ష్యం వద్దు



**కోవూరు, మే 24 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులను క్రమం తప్పకుండా పరిశుభ్రం చేసే విషయంలో సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి సుస్మితారెడ్డి అన్నారు. కోవూరులో నిమండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం మండలంలోని అన్ని పంచాయతీల పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా రక్షిత నీటి పథకాల పరిసరాలను ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకునేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు కూడా తమ ఇంటిలోని చెత్తా చెదారాలను కాలువలో పారవేయకుండా మీ ఇంటికి వచ్చే గ్రీన్ అంబాసిడర్లకు, పంచాయతీ ఏర్పాటు చేసిన చెత్త కుండీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా ఈ వేసవి సీజన్‌లో మంచినీరు కలుషితం కారణంగా పలు అంటురోగాలు ప్రభలే అవకాశం ఉందని, దీనిని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో ఎక్కడా కూడా పైప్‌లైన్ లీకేజీలు లేకుండా తగు చొరవ తీసుకోవాలన్నారు. అదేవిధంగా పంచాయతీ కార్యదర్శులు ప్రజల్లో ఈ వేసవిలో వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించేలా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

**- వాటర్ టెస్టింగ్ కిట్లు పంపిణీ** మంచినీటి శాంపిల్స్‌ను నిశితంగా పరిశీలిచేందుకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా టెస్టింగ్ కిట్లను డీపీవో సుస్మితారెడ్డి సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. ఈ కిట్లను ఏ విధంగా వాడి మంచినీటి శాంపిల్స్‌ను అవగాహన చేసుకోవాలో కోవూరు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగదీష్ పంచాయతీ కార్యదర్శులకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు విశదీకరించారు. ఎక్కడైనా పైప్‌లైన్ లీకేజీలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ నాగూర్‌వలి పంచాయతీకి సంబంధించిన పలు విషయాలపై వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని 10 పంచాయతీలకు సంబంధించిన పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

## సేంద్రియ ఎరువుల వాడకంపై రైతులు దృష్టి సారించాలి



**కోవూరు, మే 24 ప్రభాతవార్త :** వ్యవసాయం సాగు చేసే రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం పెంచేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని మండల వ్యవసాయాధికారిణి ఇందిరావతి తెలిపారు. కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న రైతుభరోసా కేంద్రంలో భూసార పరిరక్షణ పీఎం ప్రణామ్ కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశువుల ఎరువును పొలంలో తోలి ఎండకు వదిలివేయడం వలన పోషకాలు ఎండ ప్రభావానికి ఆవిరి అయిపోతాయన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని దుక్కిలు చేసే సమయంలోనే పశువుల ఎరువులను వెదజల్లుకోవడం వలన అన్ని పోషకాలు పైరుకు అందుతాయన్నారు. నారుతీతకు నాలుగైదు రోజుల ముందు నుంచే నారుమడిలో రెండు మూడు సార్లు నీటిని తీసివేసి మరలా పెట్టుట వలన నాట్లు వేసే సమయంలో నారు సులభంగా వస్తుందన్నారు. దుక్కిలు బాగా మరుగునట్లు చేసుకుని నాట్లు వేసుకోవాలన్నారు. లేకుంటే నాట్లు వేసిన తర్వాత భూమిలో సేంద్రిమ పదార్థం కుళ్లి వేడికి నాటిన నారు చనిపోతుందన్నారు. ప్రస్తుత ఈ సీజన్‌లో దుక్కిలో రసాయనిక ఎరువులను ఎక్కువగా వాడరాదన్నారు. పొటాష్ కూడా ఎకరాకు సిఫార్సు చేసిన మోతాదులో 35 కేజీలు అందులో సగభాగాన్ని నాట్లు నుంచి పిలకల దశ వరకు వేసుకోవాలన్నారు. నత్రజని పోషకం అన్ని కాంప్లెక్స్ ఎరువుల్లో ఉంటుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని యూరియా మోతాదును తగ్గించి వేసుకోవాలన్నారు. నానో యూరియా అరలీటర్ ఎకరాకు పిచికారి చేయడం వలన భూమి కాలుష్యం తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు మెహర్నిసా, రాజశేఖర్, రైతులు ఉన్నారు.

## జీవితంలో సైన్స్ ప్రాముఖ్యత ఎక్కువ



**కోవూరు, మే 24 ప్రభాతవార్త :** కోవూరులోని శాఖా గ్రంథాలయంలో శుక్రవారం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సైన్స్ ఉపాధ్యాయుడు భాస్కర్‌రావు సైన్స్ ప్రాముఖ్యత, తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్ మానవాళికి ఎంతో ఉపయోగపడుతుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే సైన్స్ పట్ల మక్కువ చూపాలన్నారు. లైబ్రేరియన్ సురేంద్రరెడ్డి విద్యార్థులకు సైన్స్ ప్రయోగాల ప్రాముఖ్యత, గ్రంథాలయంలో లభించే విజ్ఞాన శాస్త్రవేత్తల గురించి విశదీకరించారు. అనంతరం విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తదితరులు ఉన్నారు.

## కరేడు గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

**ఉలవపాడు, మే24, ప్రభాతవార్త :** ఉలవపాడు మండలం కరేడు పంచాయతీ పరిధిలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 2024 -2025 విద్యాసంవత్సరానికి విద్యార్థుల ప్రవేశానికై దరఖాస్తులు ఈనెల 31వ తేదీ లోపల దరఖాస్తులు చేసుకోవాలని గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ కే.రజిని శుక్రవార ఒక ప్రకటనలో తెలిపారు. 3వ తరగతి బాలికల కొరకు 40 సీట్లు, 4వ తరగతి ప్రవేశానికి 36సీట్లు, 5వ తరగతి ప్రవేశానికి 33సీట్లు, 6వ తరగతి ప్రవేశానికి 28సీట్లు, 7వ తరగతి ప్రవేశాలకై 17 సీట్లు, 8వ తరగతి ప్రవేశానికి 24సీట్లు, 9వ తరగతి ప్రవేశానికి 10 సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆమె తెలిపారు. దరఖాస్తులు చేసుకున్న వాటికి లాటరీ పద్ధతిలో భర్తీ చేస్తామని ఆమె తెలిపారు. మిగతా వివరాల కొరకు ఫోన్ నెంబర్ 6303145785 సంప్రదించాలని ఆమె కోరారు.

## పౌష్టికాహారం పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలి



**కోవూరు, మే 24 ప్రభాతవార్త :** గర్భవతులు, బాలింతలు అంగన్‌వాడీలో అందించే పౌష్టికాహారంతో పాటు గ్రామాల్లో చౌకగా లభించే పాలు, ఆకు కూరలు వంటి వాటిని కూడా క్రమం తప్పకుండా తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక అన్నారు. కోవూరులోని శివాజీనగర్, తదితర ప్రాంతాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త నిర్దేశించిన వేళలను పాటించాలని, వీటితో పాటు తప్పనిసరిగా గృహ సందర్శనలు చేసి గర్భవతులకు, బాలింతలకు పౌష్టికాహారం పై అవగాహన కల్పించేలా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో ఎక్కడా కూడా బాల్య వివాహాలు వంటివి జరగకుండా ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నట్లు మీ దృష్టికి వస్తే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

## ఆకట్టుకున్న నృత్యాలు



**కోవూరు, మే 24 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీపార్కు సెంటర్‌లో వెలిసి ఉన్న శ్రీ కోదండరామ స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంతాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అనంతరం దేవస్థానం ఆధ్వర్యంలో పల్లకి సేవ కార్యక్రమాలను కన్నులపండువగా నిర్వహించారు. శుక్రవారం స్వామివారి కల్యాణ కార్యక్రమం సందర్భంగా చిన్నారులు వేసిన నృత్యాలు భక్తులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ జక్కంరెడ్డి కృష్ణారెడ్డి, భక్తులు ఉన్నారు.

## జిల్లాలో పన్నుల వసూళ్లు 90 శాతం



**కోవూరు, మే 24 ప్రభాతవార్త :** జిల్లాలోని అన్ని పంచాయతీల్లో పన్నుల వసూలు 90 శాతం ఉందని డీపీవో సుస్మితా రెడ్డి అన్నారు. కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ కార్యాలయాన్ని శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ వీధుల పరిశుభ్రం పట్ల పారిశుధ్య సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టి ప్రతిరోజూ పరిశుభ్రంగా ఉంచేలా దృష్టి పెట్టాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు కూడా ప్రతి రోజూ గ్రామంలో పర్యటిస్తూ ఏమైనా సమస్య లు ఉంటే వాటిని వారితో మాట్లాడి పరిష్కరించేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ సచివాలయ ఉద్యోగులు కూడా వారికి కేటాయించిన విధులు, బాధ్యతలను సక్రమంగా నిర్వహించేలా దృష్టి పెట్టాల న్నారు. పడుగుపాడు సర్పంచ్ లక్ష్మీనారాయణ, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌రావు, తదితరులు.

## గిరిజనులకు ఆధార్ కార్డు, రేషన్ కార్డు అందించాలి



**నెల్లూరు టౌన్ ,మే24, ప్రభాతవార్త :** నెల్లూరు నగరంలోని స్థానిక ఐటీడీఏ కార్యాలయం నందు శక్రవారం యానాది సంఘాల మహాకూటమి రాష్ట్ర అధ్యక్షుడు బాపట్ల వెంకటపతి ఆధ్వర్యంలో ఐటీడీఏ పీవో డాక్టర్ మందా రాణిని కలిసి నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు, కడప జిల్లాల నందు యానాదులకు ఆధార్ కార్డు లేకుండా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ పథకాల పొందాలంటే ఆధార్ కార్డు తప్పనిసరి అని, ఆధార్ కార్డు లేని పక్షంలో ప్రభుత్వ పథకాలు దూరమయ్యే పరిస్థితి ఉందని అన్నారు. ఈ విషయంలో ఐటీడీఏ సారధ్యంలో నెలలో ఒక రోజు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి అర్హులైన గిరిజనులకు ఆధార్ కార్డు ఇప్పించాల్సిందిగా ఐటీడీఏ పీవోని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో పీవో సానుకూలంగా స్పందించి నిజమైన గిరిజనులకు ఐటీడీఏ ద్వారా ఆధార్ కార్డు రేషన్ కార్డు త్వరితగతిన అందిస్తామని వారు స్పందించారు. ఈ కార్యక్రమం అనంతరం బాపట్ల వెంకటపతి మాట్లాడుతూ ఐటీడీఏ ద్వారా బడ్జెట్ ప్రవేశపెట్టే మౌలిక వసతులు కల్పించాలని ఎడ్యుకేషన్ పరంగా గురుకులం రెసిడెన్షియల్ పాఠశాలలో గిరిజన పిల్లలకు బాలబాలికలకు మౌలిక వసతులు మెరుగుపరిచి విద్యకు నోచుకునే విధంగా చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమం కోసం రాజకీయ పార్టీలు ప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సుధీర్‌బాబు, రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ నూతలపాటి జయలక్ష్మి, జిల్లా మహిళా అధ్యక్షురాలు ఏ.అరుణ, రాష్ట్ర కోశాధికారి సీహెచ్ ప్రసాద్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఇండ్ల సుధీర్, ప్రకాశం జిల్లా అధ్యక్షులు మానికల గోపాలకృష్ణయ్య, జిల్లా కార్యదర్శి గందల రమేష్, జిల్లా కోశాధికారి కే.బాలకోటయ్య, సుబ్బారావు, వెంకటేశ్వర్లు, సురేష్, లోకసాయి, మురళి, తదితరులు పాల్గొన్నారు.

## భోజనం ప్యాకెట్లు వితరణ చేయడం సంతోషంగా ఉంది



**కావలి రూరల్, మే 24 ప్రభాతవార్త :** పేద పిల్లలకు ఎగ్ బిర్యానీ ప్యాకెట్లు వితరణ చేయడం సంతోషంగా వుందని డాక్టర్ ఉషారాణి తెలిపారు. కావలి పట్టణానికి చెందిన గోళ్ళ గుణవతీదేవి రెండో వర్ధంతి సందర్భంగా వారి కుమారుడు, కోడలు డాక్టర్ జి.పార్ధసారధిరాజు, డాక్టర్ ఉషారాణి, మనవరాలు డాక్టర్ జి.జాహ్నవిల సహకారంతో కావలి సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో శుక్రవారం 80 మంది పేద పిల్లలకు ఎగ్ బిర్యానీ ప్యాకెట్లు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో దాత డాక్టర్ ఉషారాణి, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్రలు పిల్లలకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉషారాణి మాట్లాడుతూ సంయుక్త సేవా సంస్థ ద్వారా పేదలకు అందిస్తున్న సేవలు అద్భుతంగా వున్నాయని తెలిపారు. మేము కూడా సంయుక్త సేవా సంస్థలో సభ్యులుగా చేరి సంస్థ ద్వారా ఒక నిరుపేద అమ్మాయిని దత్తత తీసుకొని చదివిస్తున్నామన్నారు. అందులో భాగంగా ఈ రోజు మా అత్తయ్య జ్ఞాపకార్ధంగా పేద పిల్లలకు భోజనం ప్యాకెట్లు వితరణ చేయడం సంతోషంగా వుందన్నారు. భవిష్యత్‌లో కూడా తమ కుటుంబం సంయుక్త సేవా సంస్థ ద్వారా అనేక సేవలు అందిస్తామన్నారు. సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సురేంద్ర మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా పేద పిల్లలకు భోజనం ప్యాకెట్లు వితరణ చేసిన దాతలు డాక్టర్ జి.పార్ధసారధిరాజు, డాక్టర్ ఉషారాణి దంపతులు, డాక్టర్ జి.జాహ్నవిలకు ధన్యవాదాలు తెలిపారు. గోళ్ళ గుణవతీదేవి పవిత్ర ఆత్మకు శాంతిచేకూరాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నామని తెలిపారు.

## వ్యక్తిపై నలుగురు వ్యక్తులు దాడి

**కావలి రూరల్, మే 24 ప్రభాతవార్త :** కావలి రూరల్ మండలంలోని తాళ్ళపాళెంలో గోవిందరెడ్డిపై నలుగురు వ్యక్తులు దాడి చేసి గాయపర్చారని కావలి రూరల్ పోలీసులు తెలిపారు. బాధితుడు గోవిందరెడ్డి కావలి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కావలి రూరల్ పోలీసులు వివరాలు తెలియజేశారు. కావలి రూరల్ మండలం తాళ్ళపాళెం గ్రామానికి చెందిన పాతపాటి గోవిందరెడ్డి 2005 సంవత్సరంలో పాతపాటి రఘురామిరెడ్డి దగ్గర సర్వే నెంబర్లు 379/1, 378లలో 3.89 ఎకరాల మామిడి తోటను కొనుగోలు చేసి స్వాధీన అగ్రిమెంట్ రాసుకున్నాడు. అప్పటి నుండి గోవిందరెడ్డి ఆధీనంలో మామిడి తోట వుందని తెలిపారు. శుక్రవారం పాతపాటి రఘురామిరెడ్డి, వెంకట కృష్ణారెడ్డి, హేమంత్‌రెడ్డి, శరత్‌రెడ్డిలు గోవిందరెడ్డి ఆధీనంలో వున్న మామిడి తోటలోని మామిడికాయలు కోస్తుండగా గోవిందరెడ్డి అడిగాడు. దీంతో ఆ నలుగురు గోవిందరెడ్డిని కాళ్లు చేతులతో కొట్టారు. హేమంత్‌రెడ్డి కర్రతో కొట్టడంతో గోవిందరెడ్డి కాలికి రక్త గాయాలయ్యామని పోలీసులు తెలిపారు. కావలి రూరల్ సిఐ కె.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఓబిసి లా గొంతుకోస్తున్న మమత బెనర్జీ



**నెల్లూరు, మే 24, ప్రభాతవార్త – వైద్యం :** పశ్చిమ బెంగాల్‌లో ఓబిసిల రిజర్వేషన్‌ను అనైతికంగా ముస్లింలకు ఇస్తూ మమత బెనర్జీ సర్కార్ తీసుకున్న చేతకాని నిర్ణయాన్ని రద్దు చేసినా, దానిని అమలు చేయడం సరికాదు అంటూ భారతీయ జనతా పార్టీ జిల్లా ఓబిసి మోర్చా అధ్యక్షుడు ఏకగ్రీవ రాజు హెచ్చరించారు. శుక్రవారం నగరంలోని రామ్మూర్తి నగర్‌లో ఉన్న బిజెపి జిల్లా కేంద్ర కార్యాలయంలో మమతా బెనర్జీ ఓబీసీల హక్కులను కాలరాస్తుందంటూ మమతా బెనర్జీ ఓబిసిల హక్కులను కాలరాస్తుందంటూ నిరసన తెలియజేసారు. ఈ సందర్భంగా యాకసిరి ఫణిరాజు మాట్లాడుతూ కలకత్తా హైకోర్టు తీర్పు ఇచ్చినా హైకోర్టు తీర్పును బేఖాతరు చేస్తూ ఓబిసిల పొట్టకొడుతూ ఓబిసిలా రిజర్వేషన్‌ను ముస్లింలకు దారిమళ్లిస్తున్న మమత బెనర్జీ నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా మహత్మ జ్యోతి రావు పూలే విగ్రహం వద్ద భారతీయ జనతా పార్టీ ఓబిసి మోర్చా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షుడు ఫణిరాజు మాట్లాడుతూ మమత సర్కారు ఓటు బ్యాంక్ రాజకీయాలకోసం ముస్లింలకు లబ్ది చేకూర్చుతూ ఉద్దేశం పూర్వకంగా ఓబిసిలకు అన్యాయం చేస్తుందని న్యాయస్థానం తీర్పు సైతం లెక్క చెయ్యకుండా ఓబిసిల పట్ల కక్షపూరితంగా వ్యవరిస్తుందని మమత వైఖరి మార్చుకోకపోతే బిసిలు గళమెత్తి మమత సర్కారుకు బుద్ధి చెపుతారు అని హెచ్చరించారు. పై కార్యక్రమానికి ఓబీసీ మోర్చా జోనల్ ఇన్చార్జి ముక్కు రాధాకృష్ణ గౌడ్, ఓబిసి మోర్చా తిరుపతి ఇన్చార్జి కోనూరు సుధీర్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగాల రామకృష్ణ, ఉపాధ్యక్షులు గుంజి కృష్ణ రాపూరు ప్రసాద్, ఉపాధ్యక్షులు శివ, కార్యదర్శి నక్క సత్యనారాయణ జిల్లా కార్యవర్గ సభ్యులు గుంజి రాజేష్, ధోనిపర్తి శ్రీనివాసులు, రఘురామయ్య, నాయకులు అశోక్ హర్ష ఆదినారాయణ, నరేష్, మారం కృష్ణ, వెంకటేష్, ఓబిసి మోర్చా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిరంతర విద్యుత్తుకు చర్యలు



**నెల్లూరు, మే 24, ప్రభాతవార్త – వైద్యం :** జిల్లాలో జూన్ 4న ఓట్ల లెక్కింపు కేంద్రాలలో నిరంతర విద్యుత్తును అందించేందుకు ఏర్పాట్లన్నీ పూర్తి చేశామని జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ వి. విజయన్ తెలిపారు. శుక్రవారం కార్పొరేషన్ పరిధిలో ఉన్న ఓట్ల లెక్కింపుకు కేంద్రమైన ప్రియదర్శిని కాలేజీని విజయన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోష్ రావు సూచనల మేరకు స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రాలకు అంతరాయ రహిత నిరంతర విద్యుత్ సరఫరాకు అన్ని చర్యలు తీసుకున్నామని జూన్ 4వ తారీఖు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, కౌంటింగ్ కేంద్రాల వద్ద ఇప్పటికే మూడు షిఫ్టలలో సిబ్బంది 24 గంటలు పని చేస్తూ ఉన్నారని అసిస్టెంట్ ఇంజనీర్ స్థాయి వ్యక్తిని ప్రతి రోజు డ్యూటీలో ఉంచడం జరిగిందని తెలిపారు. జూన్ 4వ తారీఖున సిబ్బందిని పూర్తి స్థాయిలో ఇక్కడే ఉంచుతున్నామని ఎటువంటి చిన్న సమస్యరాకుండా తగిన ఏర్పాట్లకు అని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కౌంటింగ్ రోజు ముగ్గురు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్‌ను, ఆరు మంది డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్‌ను, ఆరు మంది డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్‌లను ఇక్కడే డ్యూటీలో ఉంచుతున్నామని తెలిపారు. జిల్లా ప్రజలు కూడా ఎన్నికల ఫలితాలను టివిలలో వీక్షించేందుకు నిరంతర విద్యుత్‌ను అందించాలని డివిజన్‌ల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్‌కు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ఉన్న కనుపర్తిపాడు సబ్ స్టేషన్‌ను తనిఖీ చేయడం జరిగింది. సబ్ స్టేషన్‌లో లాగ్ బుక్, పలు రిజిస్టర్‌లను పరిశీలించారు.

## ఉదయగిరి ఎమ్మెల్యే గా కాకర్ల సురేష్ గెలుపు ఖాయం ....రసూల్ పఠాన్



**వరికుంటపాడు,మే24,ప్రభాతవార్త :** ఉదయగిరి కోట పై తెలుగుదేశం,జనసేన,బీజేపి ల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ భారీ మెజారిటితో విజయం సాధించనున్నారనీ వరికుంటపాడు మండల జనసేనా అధ్యక్షులు రసూల్ పఠాన్ అన్నారు.శుక్రవారం రసూల్ పఠాన్ ప్రభాతవార్తతో మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం ఎంతో ఉన్నత మనస్సుతో సేవా కార్యక్రమాలు చేసిన సేవాతత్పరుడు,ప్రజల మనిషి గా పేరు సంపాదించుకున్న కాకర్ల సురేష్ కు ఉదయగిరి నియోజకవర్గ ప్రజానీకం పట్టం కట్టనున్నారనీ పేర్కొన్నారు.కాకర్ల గెలుపు కోసం జనసేనా పార్టీ సైనికులు ఎంతో కష్టించారనీ,2014 లో సైతం బొల్లినేని రామారావు గెలుపులో జనసైనికులు సముచిత పాత్ర వహించారనీ,అలాగే నేటి ఎన్నికల్లో కూడా కాకర్ల సురేష్ విజయదుందిభీ సాధించడంలో తమ అధినేత పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు జనసేనికులు కీలకంగా వ్యవహరించి ఉదయగిరి నియోజకవర్గంలో కాకర్ల సురేష్ గెలుపు ను ఖాయం చేశామని తెలిపారు.ప్రజల ఆశీస్సులు మెండుగా ఉన్న కాకర్ల సురేష్ విజయం సాధిస్తే ఉదయగిరి నియోజకవర్గ రూపురేఖలు మారుతాయని అన్నారు.యువతకు ఉద్యోగాలు,ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు వంటివి కాకర్ల తోనే సాధ్యమని ఉదయగిరి ప్రజానీకం నమ్మి కాకర్ల సురేష్ కు విజయాన్ని చేకూర్చనున్నారనీ జనసేన మండల అధ్యక్షుడు రసూల్ పఠాన్ అన్నారు.

## నయనానందకరంగా సీతారాముల కల్యాణం



**కోవూరు, మే 24 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీపార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కోదండరామ స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణ కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ కాంతాచార్యులు, నాగరా జాచార్యుల పర్య వేక్షణలో అత్యంత వైభవంగా కొనసాగింది. కోదండ రాముడు , సీతమ్మ తల్లి పెళ్లికు మారుడు, పెళ్లికుమార్తెలుగా ఆశీనులైన వేళ ఆ కల్యాణ వేడుకను కనులారా వీక్షించిన భక్తజనం పులకించిపోయారు. ఈ కళ్యాణ వేడుకలో ఒక్కో ఘట్టాన్ని రుత్వికులు ఆసాంతం వివరిస్తూ సీతారాముల శిరస్సు పై జీలకర్ర బెల్లం మిశ్రమాన్ని సుమూహుర్తం వేళ అలంకరించిన ఈ దృశ్యాన్ని చూసి భక్తులు పరవశులయ్యారు. మాంగల్యం తంతునా నేనా.. లోకరక్షణ హేతునా అనే మంత్రం వినిపించగానే సీతమ్మ వారిని కోదండరాముడు మంగళసూత్ర ధారణతో పరిణయమాడిన వేళ భక్తులు రెండు చేతులతో నమస్కరించారు. ఆ ప్రాంగణమంతా సీతారాముల నామస్మరణతో మారుమోగిపోయింది. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న భక్తులు పెద్ద సంఖ్యలో కానుకలు చదివించారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ జక్కంరెడ్డి కృష్ణారెడ్డితో పాటు రుత్వికులు శేఖర్ స్వామి, రాఘవాచార్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు ఉన్నారు.

## మందుబాబులు ఎటువైపు మొగ్గు

**మనుబోలు, మే 24, ప్రభాతవార్త :** 2024లో జరిగిన ఎన్నికల్లో మందు బాబులు ఎటువైపు మొగ్గుచూపారనేది ఇప్పుడు చర్చనీయాంశమైంది. రాష్ట్ర ప్రభుత్వ మద్యం దుకాణాలను ఘననీయంగా పెంచింది. కరోనా సమయం నుండి రాష్ట్రంలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మద్యం అమ్మకాలు ఒడిదుడుకులకు లోనయ్యాయి. ఇక్కడ అమ్మే బ్రాండ్లు నాశిరకం అయిన మద్యం విక్రయాలపైన మద్యం ప్రియులు గత ఐదు సంవత్సరాలుగా పెదవి విరుస్తున్నారు. ప్రభుత్వ మద్యం విక్రయాలపైన మందుబాబులు గత ఐదు సంవత్సరాలుగా గుర్రుగా ఉన్నారని ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వానికి ఆదాయానిచ్చే ప్రభుత్వ మద్యం దుకాణాలు, మద్యం అమ్మకాలు మందు ప్రియులను భాగా నిర్లక్ష్యం చేశారనే విమర్శలు ఉన్నాయి. ఎన్నికల ముందు కూడా ఎన్నికల సంఘం రూ.1.50లక్షలు టార్గెట్ ఇచ్చి మధ్యాహ్నం, సాయంత్రానికి షాపులు మూసివేశారు. ఆ సమయంలో మద్యం ప్రియులు షాపుల మూతపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో మద్యం ప్రియుల ఓటింగ్ శాతాన్ని వాళ్ళు ఏ పార్టీకి మొగ్గుచూపుతారనే అభిప్రాయాన్ని అంచనాలు ప్రభుత్వం పరిగణలోకి తీసుకోకపోవడంపై చర్చ జరుగుతుంది. మందుబాబులు చాలా మంది ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అమ్మకాలపైన చాలా కోపంగా ఉన్నారనేది ఐదేళ్లుగా కొనసాగుతుంది. వీళ్ళు అధికార పార్టీకి ఓట్లు వేశారా లేదా అనేది అంచనాలు వేస్తున్నారు. రేపు గెలుపోటములపైన మద్యం ప్రియుల ప్రభావం తీవ్రంగా ఉంటుందని రాజకీయ పరిశీలకులు చెప్తున్నారు.

## వైభవంగా శ్రీ బాలచౌడేశ్వరి అమ్మవారి ఉత్సవాలు



**అనుమసముద్రంపేట,మే24,ప్రభాతవార్త :** బాణాసంచా పేలుళ్ళు, నవరంగి మేళాలు, డప్పు మంగళవాయిధ్యాలు, తొగట వీర క్షత్రియుల కత్తి సాములు , ప్రభల విన్యాసాలు ,న ృత్యాలతో శ్రీ బాలచౌడేశ్వరి అమ్మవారి గ్రామోత ్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. మండలంలోని ఏఎస్‌పేట లో వెలసియున్న శ్రీ బాలచౌడేశ్వరి అమ్మవారి జ్యోతి మహోత్సవ కార్యక్రమాన్ని గురు, శుక్రవారాల్లో వైభవంగా నిర్వహజంచారు. గురువారం రాత్రి నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు వైభవంగా భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహించారు. మూడేళ్ళకొకసారి జరిగే ఈ ఉత్సవాలు ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఇప్పటి వరకు ఆలయ నిర్మాణం తర్వాత రెండు సార్లు నిర్వహించామని ఇది మూడవసారి అని నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున జ్యోతులు విన్యాసాలు,ప్రత్యేక తొగట వీర క్షత్రియుల విన్యాసాలు నిర్వహించారు. స్థానిక అమ్మవారి ఆలయం నుంచి ప్రధాన వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. వేలాదిమంది నేత కార్మికులు వారి బంధువులు , స్నేహితులతో ఏఎస్‌పేట జనంతో కిక్కిరిసింది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు దూరప్రాంతాల నుండి బంధువులు సైతం తరలివచ్చారు. ఆలయాన్ని విద్యుత్‌దీపాల అలంకరణతో దేదీప్యమానంగా వెలిగిపోయింది. గ్రామంలోని ప్రధాన వీధుల్లో విద్యుత్ లైటింగ్ ఏర్పాటు చేశారు.

## అల్లిమడుగు సంఘంలో పోలీసులు కార్డన్ సర్చ్



**బిట్రగుంట, మే 24 ప్రభాతవార్త :** బోగోలు మండలంలోని అల్లిమడుగు సంఘంలో శుక్రవారం సాయంత్రం కావలి రూరల్ సిఐ బి.నాగభూషణం ఆధ్వర్యంలో బిట్రగుంట ఎస్ఐ, బిట్రగుంట, అల్లూరు, దగదర్తి పోలీస్ సిబ్బంది కార్డన్ సర్చ్ నిర్వహించారు. ఈ సర్చ్‌లో సరైన రికార్డులు లేని మూడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు.

## మాతినవారిపాలెం గ్రామంలోని ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



**కావలి, మే 24 ప్రభాతవార్త :** కావలి రూరల్ మండలం మాతినవారిపాలెం గ్రామంలోని ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని ఎన్డీఎ కూటమి కావలి అసెంబ్లీ టిడిపి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం మరలా కేసులు నమోదు కావడంతో ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు అనారోగ్య బారిన పడటానికి గల కారణాలను వైద్య సిబ్బంది వెల్లడించాలని కోరారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే విధంగా నిర్లక్ష్యం వహించవద్దని తెలిపారు. ఎలాంటి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యశాలలో చేరాలని అశ్రద్ధ చేయవద్దని ఆయన ప్రజలకు తెలిపారు. తాను, తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడు గ్రామంలోని ప్రజలకు అండగా వుంటామని తెలిపారు. ఎలాంటి సహాయం అవసరమైనా అందించేందుకు సిద్ధంగా వుంటామని తెలిపారు. గ్రామంలోని పరిస్థితులు అదుపులోకి వచ్చేంత వరకు వైద్య సిబ్బంది గ్రామంలో వుండేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఉన్నతాధికారులను కోరారు.

## అశ్వవాహనంపై కోన మాఢవీదులలో స్వామి విహారం

..ధ్వజావరోహణతో ముగిసిన బ్రహ్మోత్సవాలు



**పెంచలకోన(రాపూరు),మే24ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహ స్వామి వారికి నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలలో బాగంగా శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారు శుక్రవారం రాత్రి 10 గంటలకు అశ్వ వాహనంపై కోనలో విహరించారు. అశ్వ వాహనంపై కోనలో విహరిస్తున్న స్వామి వారిని దర్శించుకోని పెద్ద ఎత్తున భక్తులు పూజలు నిర్వహిం చారు .బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలోని యాగశాలలో నిర్వహిస్తున్న యాగంలో మహా పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. రాత్రి 11 గంటలకు స్వామి వారి బ్రహ్మోత్సవాలకు సకల దేవతలను ఆహ్వానించడంతో పాటు,బ్రహ్మోత్సవాలు ఎటువంటి విఘ్నాలు లేకుండా చూడాలని ధ్వజస్థంబంపై ఎగురువేసిన గరుత్మంతుని చిత్రపఠాన్ని(ధ్వజావరోహణ), కిందకు దింపారు. ఈ కార్యక్రమంతో కోనలో స్వామి వారికి నిర్వహిస్తున్న బ్రహ్మోత్సావాలు ముగిసాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎటువంటి ఇబ్బందులు లెకుండా స్వామి వారి ఉత్సవాలు ప్రశాంతంగా జరగడంతో అధికారులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉప కమీషనర్ జె.విజయ సాగర్ బాబు, సినియర్ సహాయకుడు పాలవల్లి లక్ష్మీ నారాయణ,ఆలయ ప్రధానార్చకులు రామయ్య స్వామి, పెంచలయ్య స్వామి, శశి స్వామి, మధు స్వామి, నాగరాజు స్వామి, వినోద్ స్వామి,మోక్షజ్ఞ స్వామి తదితరులు స్వామి వారి పూజా,అలంకరణ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

## భూసారంపై రైతులకు అవగాహన కార్యక్రమం



**కొడవలూరు మే 24 ప్రభాతవార్త :** కొడవలూరు మండలంలోని గడవరం, గౌతమ్‌నగర్ గ్రామాల నందు శుక్రవారం పిఎం ప్రణామ్ భూసార పరిరక్షణకు రైతులకు అవగాహన కార్యక్రమమును మండల వ్యవసాయ అధికారి లక్ష్మీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రైతులకి భూసార పరిరక్షణపై మరియు జీవన ఎరువులు సంభందిత ఎరువుల ఉపయోగాలు మరియు వాటి యొక్క ఆవశ్యకత గురించి రైతులకు తెలిపారు. నానో యూరియా, నానో డిఏపి యొక్క ఉపయోగాల గురించి తెలియజేయటం జరిగింది. అంతే కాక పచ్చిరొట్ట విత్తనాలైన పిల్లిపెసర విత్తనాలను 50% సబ్సిడీపైన రైతులకు పంపిణి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎఇవో అనుష, గ్రామ వ్యవసాయ సహాయకులు కవిత, సిజిత్ మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## రేపు కలువాయిలో ఉచిత వైద్యశిబిరం

**కలువాయి మే 24 ప్రభాతవార్త :** లయన్స్‌క్లబ్ ఆఫ్ నెల్లూరు వారి ఆద్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం ,ఉచిత దంత వైద్యశిబిరం ను నిర్వహించనున్నట్లు కార్యక్రమ సహాకారకులు కామిశెట్టి వెంకటేశ్వర్లు,కృష్ణం హజరత్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ నెల్లూరు,పి ,ఒ రామ్ చారిటబుల్‌ట్రస్టు మోడరన్ ఐ హాస్పటల్,నారాయాణ డెంటల్ కాలేజి హాస్పటల్ సహాకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.స్దానిక బివిఎన్‌ఆర్ జడ్‌పిహైస్కూల్ నందు ఉదయం 9.30 నుండి మద్యహ్నం 1.30 వరకు వైద్యశిబిరం నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు. ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు నిర్వహించి ఐఒఎల్ ఆపరేషన్స్ ఉచితంగా నెల్లూరు మోడరన్ హై హాస్పటల్ నందు చేయబడుతుందని అన్నారు. క్యాంపులో పాల్గొనే వారు తలస్నానం చేసి ఆధార్ కార్డుతో కార్యక్రమానికి హాజరు కావాలని వారు కోరారు. ఈ అవకాశాన్ని మండలంలోని ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

## వేదగిరి బ్రహ్మోత్సవాల్లో హుండి ఆదాయం రూ. 7,43,769



**నెల్లూరు రూరల్, మే 24, ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం బ్రహ్మోత్సవాల సందర్భంగా హుండీ ద్వారా 7.43,769 రూపాయిలు ఆదాయం వచ్చిందని తెలిపారు. పర్యవేక్షణ అధికారిగా గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వహణాధికారి వరప్రసాద్ పాల్గొనగా, పై కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి వి. గిరి కృష్ణ, నవాబ్ పేట గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులు, అర్చక సిబ్బంది, ఆలయ సిబ్బంది, రిటైర్డ్ బ్యాంక్ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## గజవాహనంపై ఊరేగిన శ్రీ సత్యనారాయణ స్వామి



**కావలి, మే 24 ప్రభాతవార్త :** కావలి రామమూర్తిపేటలో వేంచేసి వున్న శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీ సత్యనారాయణ స్వామి గజవాహనంపై ఊరేగారు. భక్తులు శ్రీ స్వామి వారిని దర్శించుకొని తరించారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు సామూహిక సత్యదేవ వ్రతాలు ఘనంగా జరిగాయి. మధ్యాహ్నం 12 గంటలకు భారీ అన్నదానం నిర్వహించారు. ఈ అన్నదానంలో భక్తులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. శ్రీ సత్యనారాయణ స్వామిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.తీర్థప్రసాదాలు స్వీకరించారు. శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానం అర్చకులు డి.శ్రీనివాసాచార్యులు, వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## గౌరవరంలో ఇంటి తలుపులు పగులగొట్టి బీరువాలో వున్న నగదు, బంగారు నగలు చోరీ

**కావలి రూరల్, మే 24 ప్రభాతవార్త :** కావలి రూరల్ మండలం గౌరవరం గ్రామంలో అత్యాల లెనిన్‌వర్మ ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో వున్న 60 వేల రూపాయల నగదు, బంగారు నగలు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన సంఘటన శుక్రవారం జరిగింది. బాధితులు కావలి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కావలి రూరల్ సిఐ కె.శ్రీనివాసరావుగౌడ్ కథనం మేరకు వివరాలు ఇలావున్నాయి. గౌరవరం గ్రామానికి చెందిన అత్యాల లెనిన్ వర్మ ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. ఆయన భార్య ప్రసన్నలక్ష్మి ఆర్ఎస్ఆర్ స్కూలులో అకౌంట్‌గా పనిచేస్తున్నారు. లెనిన్ వర్మ శుక్రవారం ఉదయం 7 గంటలకు బయటకు వెళ్లాడు. భార్య ప్రసన్న లక్ష్మి ఆర్ఎస్ఆర్ స్కూలుకు వెళ్లారు. 10 గంటల సమయంలో లెనిన్ వర్మ కుమార్తె, కుమారుడు ఆడుకోవడానికి బయటకు వెళ్లారు. వారిని తీసుకురావడానికి వాళ్ళ అత్త వెళ్లారు. వారు 10.45 గంటలకు ఇంటికి రాగా ఇంటి గ్రిల్స్, ఇంటి తలుపు తాళాలు పగులగొట్టి వున్నట్లు గుర్తించారు. బీరువాలో వున్న 60 వేల రూపాయల నగదు, 8 గ్రాముల నల్లపూసల దండ, రెండున్నర గ్రాముల ఉంగరం, 8 గ్రాముల కమ్మలను గుర్తు తెలియని దొంగలు దొంగిలించుకొని పోయినట్లు బాధితులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ శ్రీనివాసరావు గౌడ్ తెలిపారు.

## కన్నుల పండుగగా సీతారాముల కళ్యాణ మహోత్సవం



**సీతారామపురం మే 24 ప్రభాతవార్త :** ముత్యాల తలంబ్రాలు. మంగళవాయిద్యాలు. వేదమం త్రోచ్చరణ నడుమమండలంలోని గుండు పల్లి పంచాయితీ ఓగూరువాండ్ల పల్లి గ్రామ ంలో సీతాసమేత ప్రసన్న కోదండ రామ స్వామి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం సీతారాముల కళ్యాణోత్సవాన్ని వైభవంగా అంగ రంగ వైభవ ంగా నిర్వహించారు.స్దానికులతోపాటు పరిస రప్రాంతాల నుండి భక్తులు అదిక సంఖ్యలో హాజరై స్వామి వారి కళ్యాణాన్ని తిలకించారు. అనంతరం భజన కార్యక్రమాలు జరిగాయి. ఈకార్యక్రమ నిర్వాహకు లుగా ఓగూరువాండ్ల పల్లి గ్రామ కమీటి సభ్యులు వ్యవహారించారు.

## విద్యుత్‌కి అంతరాయం

**నెల్లూరు, మే 24, ప్రభాతవార్త – వైద్యం :** నగరంలోని 33/11 సరస్వతి నగర్ సబ్ స్టేషన్‌లోని 11 కెవి సరస్వతి నగర్ ఫీడర్, 11 కెవి క్రాంతి నగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా క్రాంతి నగర్, సరస్వతి నగర్, మాగుంట ఇండ్లు తదితర ప్రాంతాలలో ఉదయం 8 నుండి ఉదయం 12.30 వరకు 33/11 ఆటో నగర్ సబ్ స్టేషన్‌లోని 11 కెవి జ్యోతి నగర్ ఫీడర్, 11 త్యాగరాజ నగర్ పీడర్‌ల నందు చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా జ్యోతి నగర్, త్యాగరాజనగర్, టీచర్స్ కాలనీ, రైల్వే స్టేషన్ రోడ్, వేదయపాలెం తదితర ప్రాంతాలలో ఉదయం 7.30 నుండి ఉదయం 12 వరకు 33/11 హరనాథ్ పురం సబ్ స్టేషన్‌లోని 11 కెవి సర్వేపల్లి కట్ట ఫీడర్ నందు లైన్ షిఫ్టింగ్ పనుల కారణంగా హరనాథ్ పురం ఎక్స్‌టెన్షన్ ఏరియా, ఆనం మహేష్ లే ఔట్, సర్వేపల్లి కట్ట తదితర ప్రాంతాలలో ఉదయం 9 నుండి ఉదయం 12 వరకు, 33/11 రంగనాథ సబ్ స్టేషన్ 11 కెవి ఇసుకడొంక పీడర్ నందు ఏబి స్విచ్లు రెక్టిఫికేషన్ కారణంగా గోపురం వీధి, రంగనాయకుల పేట, బుజ్జమ్మ రేవు, ఉప్పర పాలెం, ఇసుకడొంక , గురుతోట తదితర ప్రాంతాలలో ఉదయం 8.30 నుండి మధ్యాహ్నం 12.30 వరకు విద్యుత్ సరఫరాని శనివారం నిలిపివేయడం జరుగఉతఉుందని, వినియోగదారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని, అత్యవసర విభాగం వారు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని నెల్లూరు టౌన్ డివిజన్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఏ సోమశేఖర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## ఎన్నికల కౌంటింగ్‌కు టేబుళ్లు సిద్ధం

**మనుబోలు, మే 24, ప్రభాతవార్త :** 2024 అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి. సర్వేపల్లి నియోజకవర్గంకు సంబందించి 21 రౌండ్లు ఓట్ల లెక్కింపు జరుగుతాయి. నెల్లూరు రూరల్ మండలం కనపర్తిపాడులోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కాలేజీలో జూన్4న ఓట్ల లెక్కింపుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సర్వేపల్లి నియోజకవర్గానికి సంబంధించి 284 పోలింగ్ కేంద్రాల్లో 21రౌండ్లు ఏర్పాట్లు చేశారు. మొదటి పొదలకూరు మండలం సూరాయపాలెం బూత్ నుండి కౌంటింగ్ ప్రారంభిస్తారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని పొదలకూరు, మనుబోలు, వెంకటాచలం, ముత్తుకూరు, తోటపల్లిగూడూరు మండలాలు ఉన్నాయి. ఒక మనుబోలు మండలంలో 42 పోలింగ్ కేంద్రాల్లో 32033 ఓట్లు ఉన్నాయి. పొదలకూరు మండలం 48553, తోటపల్లిగూడూరు 36127, ముత్తుకూరు 38154, వెంకటాచలం 44290, మనుబోలు మండలం 27494 ఓట్లు పోలైన సంగతి తెలిసిందే. మరో పది రోజులు ఎన్నికలు దగ్గర పడేకొద్ది ఎన్నికల వేడి మొదలుకానుంది.

## నేతల గుండెల్లో గుబుళ్ళు

**మనుబోలు, మే 24, ప్రభాతవార్త :** 2024 ఎన్నికల కౌంటింగ్ దగ్గర పడే కొద్ది వివిధ పార్టీల నేతల గుండెల్లో గుబుళ్ళు మొదలయ్యాయి. మరో 12రోజుల్లో కౌంటింగ్ దగ్గర పడనుండటంతో సర్వేపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా అటు అధికార పార్టీ వైకాపా నేతల్లో, ఇటు టీడీపీ నాయకుల్లో గుబుళ్ళు మొదలయ్యాయి. నియోజకవర్గ వ్యాప్తంగా ఎక్కడ చూసిన కాకాణి, సోమిరెడ్డి గెలుపోటములపైనే చర్చలు కొనసాగుతున్నాయి. బెంగుళూరులో రేవ్ పార్టీ వ్యవహారం గోవర్ధన్‌రెడ్డి, సోమిరెడ్డి మధ్య చిచ్చురేపింది. రెండు రోజులుగా ఈ గొడవ తారాస్థాయికి చేరింది. ఇద్దరి మధ్య సోషల్ మీడియాలో ఆరోపణలు, విమర్శల వీడియోలు వైరల్ అవుతున్నాయి. మరో 12 రోజుల్లో ఎన్నికల కౌంటింగ్ దగ్గర పడే సమయంలో ఈ వీడియో వైరల్ కావడం సర్వేపల్లి నియోజకవర్గంలో ఇరు పార్టీల మధ్య రాజకీయ వేడి పెరిగింది. ముఖ్యంగా అధికార వైకాపా పార్టీ నేతల్లో టెన్షన్ పెరుగుతుంది. అలాగే టీడీపీ నాయకుల్లో కూడా సోమిరెడ్డి వర్గం నేతలు ఎక్కడా లేని టెన్షన్‌కు గురవుతున్నారు. అభ్యర్థుల కంటే మండల స్థాయి నాయకుల్లో టెన్షన్ పెరిగిపోతుంది. ఎక్కడ నలుగురు కూర్చున్నా కలిసి ఉన్నా గెలుపోటములపైనే చర్చలు కొనసాగుతున్నాయి. అధికార వైకాపా నాయకులు ఎట్టి పరిస్థితుల్లో తామే గెలుస్తామని మళ్లీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విశాఖపట్నంలో ప్రమాణ స్వీకారం చేస్తారని చెపుతూనే వాళ్ళ మనుషుల్లో మాత్రం ఒక్కింత ఆందోళన కనిపిస్తుంది. ఒక తెలుగుదేశం పార్టీ నాయకుల్లో ప్రభుత్వ వ్యతిరేకత, తెలుగుదేశం గాలి, బాబు షూరిటీ, భవిష్యత్తుకు గ్యారంటీ, సూపర్ సిక్స్ పథకాలు గెలిపిస్తాయని ఒత్తిడిని అధిగమిస్తూ చాలా ధీమాగా ఉన్నారు. బెట్టింగ్‌లు ఎక్కువగా తెలుగుదేశం వైపునే చాలా మంది మొగ్గుచూపుతున్నారు. ఈ ప్రయత్నంలో కొందరు వీరవిధేయులైన నాయకులు మొక్కుబడులు పెట్టుకుంటున్నారు. కాకాణి గెలిస్తే తిరుమల వస్తానని కొందరు టీడీపీ సోమిరెడ్డి గెలిస్తే తిరుమలకు కాలి నడకకు వెళ్తామని మరికొందరు మొక్కుబడులు పెట్టుకుంటున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా ప్రజల సమస్యలు సబ్దుగా నిలిచిపోయాయి. ఎన్నికల కౌంటింగ్ అనంతరం కొత్త ప్రభుత్వం వచ్చే వరకు ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు మొదలవుతాయని చెబుతున్నారు.